క్లుప్తంగా

ఘనంగా తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవాలు



పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేటలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవాల్ని ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయకుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉత్సవమూర్తులకు గణపతి పూజ, గణపతి హోమం, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పసుపు కుంకుమ, విభూదితో విశేష అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా అను డాన్స్ అకాడమీ విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్ని రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



పాత గుంటూరు: అరండల్‌పేట నాలుగో లైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేద మంత్రాలతో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధానాచార్యులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీచక్ర అభిషేకాలు, నిత్య పూజలు, కల్యాణంలో విశేష పూజల్ని జరిపారు. కల్యాణమూర్తులకు వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో పుష్పాభిషేకం నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో పుష్పయాగం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో లక్ష్మీ జయంతి సందర్భంగా బుధవారం శ్రీపద్మావతి అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి మాధవస్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పలు రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిశ్చల్ నరసింహం, సిమ్రాన్‌కౌర్ దంపతుల సౌజన్యంతో నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



పాత గుంటూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లో నగేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో బుధవారం ఐదుగురు మున్సిపల్ పారిశుద్ధ్య మహిళా కార్మికుల్ని సత్కరించారు. కార్యక్రమంలో మండలి వ్యవస్థాపకులు నగేష్ ఖన్నా, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సాంబశివరావు, ఆదినారాయణ రావు, గురవారెడ్డి, కాల్వపల్లి సాంబిరెడ్డి, పోరూరి సత్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట




వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ ఆచారి తదితరులు

లక్ష్మీపురం: రాష్ట్రంలో మహిళల భద్రత, సంక్షేమంతో పాటు వారి ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) తెలిపారు. అరండల్‌పేటలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో బుధవారం పరుశురామ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కప్పగంతు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ మహిళల పేరిట ఇళ్ల పట్టాల్ని అందజేసి నేనున్నా అనే భరోసాను కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. మహిళలకు అన్ని రంగాల్లో ఆయన ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఫణిబాబు, బందా రవీంద్రనాథ్, చంద్రకళ, జయ, అన్నపూర్ణ, లక్ష్మి, సుశీల పాల్గొన్నారు.

ఆధునిక జీవనశైలితో ముంచుకొస్తున్న ముప్పు

- నేడు వరల్డ్ కిడ్నీ డే
- పెరుగుతున్న కిడ్నీ జబ్బుల కేసులు
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం
- రోగులకు అందుబాటులో ఆధునిక వైద్యసేవలు



గుంటూరు మెడికల్: శరీరంలో కిడ్నీలు కీలకపాత్ర పోషిస్తాయి. చిక్కుడు గింజ ఆకారంలో ఉండే ఇవి నిరంతరం రక్తాన్ని పరిశుభ్రం చేస్తుంటాయి. ఒక్క రోజులోనే సుమారు 200 లీటర్లను వడకట్టి రక్తపోటు నియంత్రణతో పాటు ఒంట్లో నీరు, లవణాల సమతుల్యత దెబ్బతినకుండా కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. నేటి మనిషి ఆధునిక జీవనశైలిలో కిడ్నీ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు 2006 నుంచి ప్రతి ఏడాది మార్చి రెండో గురువారం వరల్డ్ కిడ్నీ డేని నిర్వహిస్తున్నారు. ఈనెల 9న వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

బాధితులు అధికమే...

ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. మన దేశంలో 10లక్షల మందిలో 800 మంది కేవలం షుగర్ వల్ల కిడ్నీ జబ్బులకు గురవుతున్నారు. జిల్లాలో 20 మంది వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్ద ప్రతిరోజూ 30 నుంచి 40 మంది కిడ్నీ సమస్యలతో చికిత్స పొందుతున్నారు. చిన్న పిల్లల్లో సైతం జబ్బులు రావడంపై నెఫ్రాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధి లక్షణాలు

- వ్యాధి సోకినవారిలో ముఖం, కాళ్లవాపులు కనిపిస్తాయి
- ఆయాసం, అలసటగా ఉంటుంది.
- పనిమీద ఏకాగ్రత తగ్గడంతో పాటు ఆకలి మందగిస్తుంది.
- రాత్రివేళల్లో మూత్రం ఎక్కువసార్లు రావటం, కొన్ని సందర్భాల్లో సరిగా రాకపోవడంతో పాటు రక్తం కారుతుంది.
- మూత్రం పోసేటప్పుడు దీర్ఘకాలంగా చురుకు, మంట

హైరిస్క్ వారు జాగ్రత్తగా ఉండాలి

బీపీ, షుగర్ ఉన్నవాళ్లు హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు. వీరి కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. షుగర్ సోకిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు పాడయ్యే అవకాశం ఎక్కువ. అధిక బరువు ఉన్నవారు సైతం జబ్బున పడే ప్రమాదం ఉంది. జీనవశైలిలో వచ్చిన మార్పుల వల్ల నేడు 20 ఏళ్లు దాటిన ప్రతి 10 మందిలో ఒకరు బారిన పడుతున్నారు. షుగర్, అధికరక్తపోటు, ఊబకాయం దీనికి కారణం. బీపీ, షుగర్ ఉన్నవాళ్లు తప్పనిసరిగా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. వయస్సు మీద పడేకొద్దీ సహజంగా మూత్ర సంబంధిత సమస్యలు వస్తాయి. వాటిని సకాలంలో గుర్తించకపోతే కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది.

వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త అవసరం



క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తంలో చక్కెర శాతాన్ని, అధిక రక్తపోటులను నియంత్రణలో ఉంచుకోవాలి. ఆరోగ్య కరమైన ఆహార నియమాలు పాటించాలి. అధిక బరువును తగ్గించుకోవాలి. డాక్టర్ పర్యవేక్షణ లేకుండా ఇష్టం వచ్చినరీతిలో మందులు వాడకూడదు. పొగ, మద్యం తాగడంలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. పరిమితమైన ఆహారం, ఉప్పు తగ్గించి వాడటంతో పాటు ఎక్కువగా నీటిని తాగాలి.

– డాక్టర్ అన్నపురెడ్డి శివనాగేంద్రరెడ్డి, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

అందుబాటులో ఆధునిక వైద్యం



బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకపోయినా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసే ఆధునిక వైద్యసేవలు నేడు అందుబాటులో ఉన్నాయి. మిస్ మ్యాచ్ కిడ్నీ బాధితులు పలువురికి విజయవంతంగా ఆపరేషన్లు చేశాం. జీవనధాన్ పథకం ద్వారా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాము. డయాలసిస్ చేయించుకునేవారికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేస్తే ఎంతో ఉపయోగంగా ఉండి, జీవితకాలం 20 ఏళ్ల వరకు పొడిగించవచ్చు.

– డాక్టర్ చింతారామకృష్ణ, కిడ్నీ మార్పిడి వైద్య నిపుణులు, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు



గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చేవారి సంఖ్య 100 నుంచి 150 వరకు ఉంటుంది. వీరే కాకుండా ప్రతి రోజూ 40 మందికి పైగా రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. పాజిటివ్ కేసులకు కూడా డయాలసిస్ చేసే సౌకర్యం ఉంది. ఆస్పత్రిలో 24 గంటలూ డయాలసిస్ వైద్యసేవలు జరుగుతూనే ఉంటాయి.

– డాక్టర్ మొహమ్మద్ అస్లాం, నెఫ్రాలజిస్ట్, జీజీహెచ్ గుంటూరు

మహిళా సాధికారత సీఎం జగన్ చలువే

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాను సత్కరిస్తున్న జెట్పీటీసీ సభ్యులు



ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులకు సన్మానం



ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులకు సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో మహిళా సాధికారత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన సీఎం జగన్ ప్రోత్సాహం మరువలేనిదని కొనియాడారు. అనంతరం ఉద్యోగినులకు నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు, పలువురు జెడ్పీటీసీ సభ్యులు హెనీ క్రిస్టినాను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ బత్తుల అనూరాధ, జెడ్పీటీసీ సభ్యులు రమేష్, జ్యోతి, వెంకటలక్ష్మి, గుల్జార్ బేగం, పావని, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టాభిపురం హైస్కూలులో వేడుకలు

పట్టాభిపురం హైస్కూల్లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీనియర్ న్యాయవాది ఆర్. వాణిని సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి రామకృష్ణ పరమహంస, ఉపాధ్యాయులు రమణి, కామేశ్వరి, మయూరి, ఫణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు పేర్కొన్నారు. కంకరగుంటలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని సంఘ రాష్ట్ర మహిళా కన్వీనర్ సీహెచ్. ఉమాదేవి, జిల్లా మహిళా కన్వీనర్ పి. రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.అంబరీషుడు మాట్లాడుతూ ఎక్కడ మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొనియాడుతారని తెలిపారు. శాంతి, సహనం, త్యాగానికి, స్త్రీలు ప్రతిరూపాలని కొనియాడారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ మండలాల చెందిన 40 మంది మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.బెనహర్‌బాబు, నాయకులు కొరివి అనిల్ కుమార్, పేరేచర్ల శ్రీనివాసరావు కె.వి రమణ, సాలార్ బేగ్, బాబూరావు, ఎండీ.నజీర్, వి.కృష్ణారెడ్డి, మార్పు వెంకటేశ్వర్లు, ఎస్తేరు రాణి, ప్రమీల, జ్యోతి, దిన, రూపా దేవి, రమాదేవి, ఉమాదేవి, వర్షీనియా, శారద, విజయనిర్మల, మాధవి, తాహేరా పాల్గొన్నారు.

మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలి

మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్–1938) జిల్లా అధ్యక్షుడు గోవిందు వేళాంగణిరాజు పేర్కొన్నారు. నగరంపాలెంలోని బిషప్ ఇగ్నేషియస్ యూపీ స్కూల్లో బుధవారం జరిగిన మహిళా దినోత్సవంలో 18 మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయినులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టిబోయిన నరసింహారావు, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ విజయానంద్, సామాజిక ఉద్యమనేత ఉగ్గం సాంబశివరావు, జిల్లాపూర్వ అధ్యక్షుడు కైలాష్‌నాథ్, సహాధ్యక్షుడు పి.రమేష్, జిల్లా అదనపు కార్యదర్శి మోపిదేవి శివశంకరరావు, బాపట్ల జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, చంద్రశేఖర్, పొన్నూరు మండల శాఖ అధ్యక్షుడు వినుకొండయ్య, నగర శాఖ ప్రధాన కార్యదర్శి జోజప్ప, ప్రమీలారాణి, కె.సుధారాణి, జి.గణేష్, యస్.ప్రసాద్, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకురాలు వి.జయ, రచయిత్రి ఎ.వి.కె. సుజాతను ఘనంగా సన్మానించారు. కార్యక్మరంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.వరకమలా దేవి, ఫ్రీలాన్స్ జర్నలిస్టు పింగళి భాగ్యలక్ష్మి, మానసిక వైద్యురాలు యాస్మిన్, డాక్టర్ అపూర్వ నమ్రతా ప్రసంగించారు.

హక్కులపై అవగాహన అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో బుధవారం ఎంఎస్ఐ, అంధేరీ హిల్స్ సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గృహ కార్మికులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎస్ఐ రాష్ట్ర సమన్వయకర్త సిస్టర్ జెనొవ్టస్ మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిస్టర్ ఐడా, సిస్టర్ వ్యాకుల మేరి, గృహ కార్మిక మహిళలు పాల్గొన్నారు.

యోగా గురువు సుబ్బాయమ్మకు పురస్కారం

పాత గుంటూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుంటూరుకు చెందిన యోగా గురువు పెంటేల సుబ్బాయమ్మకు రోటరీ ఉత్తమ మహిళా పురస్కారం లభించింది. చిలకలూరిపేటలో రోటరీక్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో జరిగిన సభలో క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి రాఘవయ్య పురస్కారాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో యోగా గురువు పెంటేల జైహింద్ గురూజీ, మోహన్, ప్రతాపరెడ్డి, కృష్ణవేణి, రత్నం నాయుడు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

గుంటూరు వెస్ట్: మహిళలు విద్య, ఉపాధి, కుటుంబ బాధ్యతలతోపాటు ఆరోగ్యాన్ని నిత్యం కాపాడుకోవాలని జాయ్ అండ్ షైన్ వెల్‌నెస్ సెంటర్ కోచ్ జ్యోతి శ్యామ్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బ్రాడీపేటలోని సంస్థలో క్లబ్ సభ్యులు కోచ్ జ్యోతి శ్యామ్ దంపతుల్ని ఘనంగా సత్కరించారు. జ్యోతి శ్యామ్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు బలవర్ధక ఆహారంతో పాటు నిత్యం యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యానీ అమల, సతీష్, అనూష, శైలజ, ఎం.శ్రీనివాసరావు, శ్యామ్ పాల్గొన్నారు.

కీటోన్ జిమ్‌లో వేడుకలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చంద్రమౌళీనగర్‌లోని కీటోన్ జిమ్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. యువతను ప్రోత్సహించేందుకు రెజ్లింట్ పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం డాక్టర్ బెల్లం ధరణి, ఆల్ ఇండియా ఫెడరేషన్ రెజ్లింట్ కోచ్ నూర్జహాన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కీటోన్ మేనేజర్ బి.రవితేజ, అథ్లెటిక్ కోచ్ ఆర్. శివాజీ పాల్గొన్నారు.

జిల్లా జైలులో ఘనంగా మహిళా దినోత్సవం

గుంటూరు లీగల్: జిల్లా జైలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె.రఘు అధ్యక్షత వహించి, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రను వివరించారు. మహిళలు లేనిదే జీవితానికి పరమార్థం లేదన్నారు. మహిళలు అత్యున్నత స్థానాలకు ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులతో కేక్ కట్ చేయించారు. మిఠాయిలు పంచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కారాగార నాన్ అఫీషియల్ విజిటర్ డాక్టర్ కె.శారదాదేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని ప్రశంసించారు. జైలర్ బి.తేజేశ్వరరావు, డిప్యూటీ జైలర్లు టి.వెంకటరత్నం, ఏ.కల్యాణ్‌బాబు పాల్గొన్నారు.



సీనియర్ న్యాయవాది వాణిని సత్కరిస్తున్న ఉపాధ్యాయినులు



అవగాహన సంస్థ కార్యాలయంలో మహిళలకు సన్మానం



హెల్త్ కోచ్ జ్యోతి శ్యామ్ దంపతులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు



మాట్లాడుతున్న సిస్టర్ వ్యాకుల మేరీ



కీటోన్ జిమ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



పురస్కారం స్వీకరిస్తున్న సుబ్బాయమ్మ

కుటుంబ వ్యవస్థను కాపాడేది మహిళలే..

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): భారత సమాజం రక్షించబడుతుందంటే కారణం కుటుంబ వ్యవస్థ అని, దానికి ఆలంబనగా వ్యవహరించేది మహిళలే అని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎందరో మహిళలు దేశ నాయకులుగా చరిత్ర సృష్టిస్తూ, జాతి దశను, దిశను మార్చేస్తున్నారని వెల్లడించారు. బజరంగ్ ఫౌండేషన్ మహిళా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నారీ రుతువు కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం సంస్థ కార్యాలయం, ఫౌండేషన్‌లలో పనిచేస్తున్న ఉద్యోగినులు, కార్మికుల్ని సత్కరించారు. బజరంగ్ డైరెక్టర్లు సిద్ధినేని శ్రీనివాసరావు, ఎస్.సమీర్‌నందన్, జి.సుబ్బారావు పాల్గొన్నారు.

12న ముత్తాయపాలెంలో కళ్లజోళ్ల పంపిణీ

'జగనన్న సంక్షేమ సంవత్సరం' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6న బాపట్ల నియోజకవర్గంలోని ముత్తాయపాలెంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన వారికి యుద్ధప్రాతిపదిన వాటిని సిద్ధం చేయిస్తున్నామని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల వ్యవధిలోనే 507 మంది నిరుపేదలు, మత్స్యకారులకు కళ్లజోళ్ల పంపిణీని ఈనెల 12న (ఆదివారం) సాయంత్రం 3.30 గంటలకు ముత్తాయపాలెంలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కళ్లజోళ్లకు ఎంపికైన వారందరూ ఆ రోజు గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి బొమ్మ వద్దకు వచ్చి తీసుకోవాలని ఆయన సూచించారు.



కేక్ కట్ చేయిస్తున్న సీఈఓ అంబటి మురళీకృష్ణ

సంక్షేమ పథకాలతో సంతోషంలో ప్రజలు

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నగరంపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. 19వ డివిజన్ 64వ సచివాలయ పరిధిలోని నల్లచెరువు ప్రధాన రహదారిలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డివిజన్ కార్పొరేటర్ తేలుకుట్ల హనుమయమ్మ అధ్యక్షత వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులకు బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ అమ్మఒడి, చేయూత, ఈబీసీ నేస్తం వంటి అనేక పథకాలు అందడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. జగన్ పాలనలో పేదలు జీవించగలమని, పిల్లల్ని ఉన్నతంగా చదివించగలమనే నమ్మకం వారిలో ఏర్పడిందని చెప్పారు. గతంలో మాదిరి జన్మభూమి కమిటీలు కాకుండా సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుతో పథకాలు సక్రమంగా అందుతున్నాయని తెలిపారు. ఎవరూ జేబులు నింపాల్సిన అవసరంలేదని, చేతులు తడపాల్సిన అవసరంలేదనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు మూడు వేల స్థలాల్ని పంపిణీ చేశామని, వాటిల్లో గృహ నిర్మాణాల్ని కూడా నిర్మించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని వెల్లడించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం పేదలకు బ్రహ్మాండమైన సౌకర్యాల్ని కల్పించనుందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం అనేవి సీఎం జగన్‌కు రెండు కళ్లు వంటివని ఎమ్మెల్యే వివరించారు. గత ప్రభుత్వం రెంటిండిని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. దాన్ని చక్కదిద్దేందుకు సీఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప మేయర్ షేక్ సజీల, నాయకులు టెంట్‌హౌస్ బాబు, తేలుకుట్ల హనుమాయమ్మ, రాష్ట్ర బత్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ కూరపాటి రామరాజు, యద్దనపల్లి బాలరాజు, సోమికమల్, కామిశెట్టి మధు, నాగూర్, ఫాతిమున్, షకీలా, కుమ్మెర రాము, వాసు, గంగరాజు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడల్ని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రెండు శాతం రిజర్వేషన్లు కల్పించారని తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకురాలు షేక్ నూరి ఫాతిమా తెలిపారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో 9వ జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల మహిళల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. వీలైనంత వరకు క్రీడా సాధన చేయాలని ఆమె సూచించారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి అశోక్‌బాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 50 మంది పాల్గొన్నారన్నారు. విజేతలు ఈ నెల 10, 11 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ డి.ఎస్. క్రిష్టోఫర్, అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్లు షేక్ మీరావలి, షేక్ ఖాజా మొహిద్దీన్, కోచ్ సంగీత్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ తల్లి ఊరేగింపు



అమ్మవారిని పల్లకీ సేవకు తీసుకెళ్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: లక్ష్మీతిరుపతమ్మ తల్లి చల్లని దీవెనలు అందించాలని శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. శ్రీనివాసరావుపేటలోని లక్ష్మీతిరుపతమ్మ తల్లి 28వ వార్షిక మహోత్సవాలు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, స్థానిక కార్పొరేటర్ గేదెల నాగరంగమణి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆళ్ల శ్రీను, ఆళ్ల హరి, నాగమ్మ శ్రీను, అబ్బిశెట్టి రంగా, రామకృష్ణ, పగడాల రామకృష్ణ, జె.రామారావు పాల్గొన్నారు.